# మంగళధ్వని

జూన్ ఒకటో తేదీ. ఉదయం తొమ్మిది గంటలు దాటింది. ఆఫీసులకి వెళ్లేవాళ్లు చకచకా సన్నాహాలు పూర్తిచేసుకునేవేళ. అక్కడక్కడా తారట్లాడుతున్న మబ్బుల చాటునుంచి సూర్యుడు ఆశ్చర్యం ప్రకటిస్తున్నాడు. వైశాఖ మాసంలో మబ్బులు ప్రత్యక్షమయ్యాయెందుకు? అవికూడా చోద్యం చూడడానికి వచ్చాయేమో!

నిన్న సాయంత్రం ఐదు గంటలవరకూ జానకిరామయ్య గవర్నమెంటు హైస్కూలు హెడ్మాస్టరే. మరుక్షణం రిటైరైన హెడ్మాస్టరు. ఎంత పేరున్నా సరే - కాలం ఒకరికోసం ఆగదు. పదవీ విరమణ తప్పదు. నిజానికి జిల్లా మొత్తంమీద ఆయనతో సాటిరాగలవాళ్లెవ్వరూ లేరంటే అతిశయోక్తి లేదు. పాఠాలు చెప్పడంలోగాని, స్కూలు అద్భుతంగా నడపడంలోగాని ఆయన పద్ధతే వేరు. ఒక్కమాటలో చెప్పాలంటే జానకిరామయ్య హయాంలో గవర్నమెంట్ హైస్కూలు పెద్ద మిషనరీ స్కూలుకున్నంత ఖ్యాతి చేకూర్చుకుంది. క్రమశిక్షణకీ, చిత్తశుద్ధికీ మారుపేరు జానకిరామయ్య. సీటు కావాలంటే విద్యార్థి తన ప్రతిభ నిరూపించుకోవాలి. బ్రహ్మరుద్రులు సిఫారసు చేసినా తెలివితేటలు లేనివారిని ససేమిరా చేర్చుకోవడం వుండదు. ఆయన క్లాసు వినడం విద్యార్థులకి ఒక గొప్ప అనుభూతి. ఒక వరం. డాక్టర్ సి. నారాయణరెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎం. ఏ. తెలుగు విద్యార్థులకి పాఠం చెబుతుంటే వేరే సబ్జక్ట్ విద్యార్థులెందరో వచ్చి ముగ్ధులయ్యేవారు. ఈ సంగతి తరచు జానకిరామయ్య తరగతిలో ప్రస్తావించేవారు. వాస్తవానికి ఆయన తరగతికీ అలా జరిగేది. పిన్ డ్రాప్ సైలెన్స్ అంటే నిర్వచనం జానకిరామయ్యక్లాసే. అంతకాకపోయినా కొంతైనా పేరు తెచ్చుకోవాలని ఇతర ఉపాధ్యాయులందరూ త్రికరణశుద్ధిగా ప్రయత్నించేవారు.

సమయ పాలనంటే ఆయనకి చాలా నిష్ఠ. బడిగంటనుబట్టి చుట్టుపట్లవారంతా గడియారాలు సరిచేసుకునేవారు. జస్టిస్ ఆవుల సాంబశివరావుపేరు ఆహ్వాన పత్రంలో వుంటే ఎంత పెద్ద సభైనా సరే - చెప్పిన సమయానికి ఆరంభం కాక తప్పదనే సత్యాన్ని జానకిరామయ్య ఎన్నో సమావేశాల్లో చెప్పి నిర్వాహకుల్ని సున్నితంగా హెచ్చరించేవారు.

వీడ్కోలు సభలో వక్తలు ఆయన గుణగణాల్ని పొగుడుతుంటే విద్యార్థులు గుండెలు గర్వంతో ఉప్పొంగిపోయాయి. తీరా సభ ముగిసి ఆయన ఇంటికి వెళ్లిపోయే సమయంలో పసిహృదయాలు గొల్లుమన్నాయి. తడికళ్లతో ఆయన

ఇంటివరకు వెంట వెళ్తుంటే దయనీయమైన ఆ దృశ్యాన్ని చూస్తున్న ద్వాదశి చంద్రుడుకూడా వెన్నెల కన్నీరు కార్చాడు.

నిన్న గడిచిపోయింది. ఈరోజు జానకిరామయ్య హైస్కూలు మాజీ హెడ్మాస్టరు. కానీ ఇవ్వాళకూడా గడియారం ముళ్లు తిరిగినట్లు యధాప్రకారం పనులు చేసుకుంటున్నాడు. ఉదయం సూర్యోదయానికి ముందే నిద్రలేచినప్పటినుంచి దైనందిన కృత్యాలలో మార్పులేదు. ఎప్పటిలాగే సాగుతున్నాయి.

కర్మసాక్షి సూర్యుడికే సరిగా అర్థమయినట్టు లేదు. ఇక ఇంట్లోవాళ్లకి సంగతి బోధపడడం అంత తేలిక కాదు.

ఎవరికి తోచినట్టు వాళ్లు అనుకోవచ్చు. ముప్ఫై ఐదేళ్లుగా వున్న అలవాటు ఒక్కసారి ఎలా మర్చిపోతాడని అనుకోవడానికి కూడా అవకాశముంది. ఏమైనా ఆయన పనులు ఆయన మామూలుగా చేసుకోవడం మరీ మంచిదే. ఎవరికీ ఇబ్బందిలేని సంగతి అని సర్దిచెప్పుకున్నా చెప్పుకోవచ్చుగదా!

ఇంతకూ జానకిరామయ్యకాక ఆ ఇంట్లో వుండేది నలుగురు. ఇల్లాలంటే ఇలా వుండాలనిపించే మహాలక్ష్మి ఉత్తమురాలు. దైవభక్తి అధికం. భర్త ఆనందమే తన ఆనందమనుకుంటుంది. నిజమైన సహధర్మచారిణి. శాంతమూర్తి. భర్తమాటకి ఎదురు చెప్పి ఎరుగదు. అయినా భర్తని ఏమని అడుగుతుంది? దీనికితోడు ఎప్పుడో ఐదేళ్లక్రితం భర్త చెప్పిన సంగతి మరీ మరీ మనస్సులో మెదులుతూ పెదవి విప్పడానికి అడ్డు నిలుస్తోంది. జానకిరామయ్యకీ డాక్టర్ రావూరి భరద్వాజకీ మంచి స్నేహం. ఆయన చెప్పిన విచిత్రోదంతం. ఎ.జి. ఆఫీసులో ఒకాయన పనిచేస్తున్నాడు. రిటైరైన మర్నాడు మామూలుగా తొమ్మిదిన్నరకి భోజనం వడ్డించమని భార్యతో చెప్పాడు. 'ఇప్పుడు మీకు తొందరేమొచ్చె. నిదానంగా తిందురుగాని. ముందు అబ్బాయి తిని ఆఫీసుకు వెళ్తాడు' అంది. 'అలాగే' అన్నాడు. ఎలాంటి ఆవేశం మాటల్లోగాని ముఖంలోగాని కనిపించలేదు. గదిలోకి వెళ్లి చొక్కా తొడుక్కున్నాడు. భుజాన కండువా వేసుకున్నాడు. బయటకు వెళ్లాడు. మళ్లీ ఇంటికి రాలేదు. మనస్సును కలిచివేసే ఈ సన్నివేశం ఐదేళ్లుగా ఆమె ఎన్నడూ మరిచిపోలేదు. అందులో అత్యంతంగా ముఖ్యమైన ఈ రోజున ఎలా విస్మరిస్తుంది? సందేహఛాయలు లేశమైనా ముఖంలో కనిపించనీయలేదు. ఎప్పటిలానే భర్త దైనిక చర్యల్లో తోడ్పడింది. పూజకు సామగ్రి అందించింది. భోజనం వడ్డించింది.

జానకిరామయ్య కుమార్తె పద్మిని కాలేజీలో బి. ఏ. చదువుతోంది. వినయ విధేయతలు ఆమె సొత్తు. చదువుపైన అంతులేని ఆసక్తి. తల్లిదండ్రులకు చెప్పి కాలేజీకి వెళ్లిపోయింది.

కొడుకు సీతారాం బ్యాంకు ఆఫీసరు. పెళ్లయి ఆరు మాసాలయింది. చదువు సంధ్యలు చెప్పించి ఇంతవాణ్ణి చేసింది తల్లిదండ్రులని గుర్తుపెట్టుకున్న విజ్ఞుడు. తండ్రి క్రమశిక్షణ, తల్లి భక్తిభావం బాగా అలవడ్డాయి. తల్లిదండ్రుల్ని చిన్నతనంనుంచి ప్రత్యక్ష దైవాలుగా పరిగణిస్తున్నాడు. తండ్రి దగ్గరకంటే తల్లిదగ్గర

చనువెక్కువ. పైగా స్కూలులో పనేదైనా వుండవచ్చునని, పింఛను కాగితాల పని ఏదైనా వుండవచ్చునని అనుకున్నాడు.

కోడలు శారదకూడా బ్యాంకులో పనిచేస్తోంది. మెట్టినింటిని పుట్టినిల్లుగా మనసా వాచా కర్మణా ఎంచుకుంటున్న ఉత్తమ సంస్కారం ఆమెది. అమ్మాయ్ అని పిలిచే అత్తగారిని తల్లితో సమానంగానూ, అమ్మా అని పిలిచే మామగారిని తండ్రితో సమానంగానూ చూసుకుంటుంది. అత్తమామలు తనపట్ల చూపే ఆదరానికి గుండె అంతా కృతజ్ఞతనింపుకుంది. అత్తవారింటికి వచ్చేటప్పుడు తండ్రి 'తల్లీ! ఇకనుంచీ నీ భర్త నీకు తోడుగా, నీ అత్తమామలు తల్లిదండ్రులుగా వుంటారని ఎప్పుడూ గుర్తుంచుకో తల్లీ!' అని చెప్పిన మాటలు నిత్యం చెవులలో ప్రతిధ్వనిస్తూంటాయి. మామగారు రిటైరవుతున్న సంగతి తెలుసు. తన మనస్సులోని మాట చెప్పేందుకు మంచి సమయంకోసం ఎదురుచూస్తోంది. భర్తతో కలిసి బ్యాంకుకు వెళ్లేముందే ఈ రోజే ఆ మాట చెప్పడానికి సరైన తరుణమని భావించింది. భర్తతో ఈ సంగతి ప్రస్తావిస్తే, 'అవును, ఇప్పుడే చెప్పు, నాన్న సంతోషిస్తాడు' అని ధైర్యం చెప్పాడు.

ఉత్తరీయం వేసుకుని, జేబులో కలం పెట్టుకుంటూ హాలులోకి వచ్చిన మామగారి దగ్గిరికి శారద వచ్చింది. సీతారాం అప్పుడే గదిలోంచి ఇవతలికి వచ్చాడు.

మహాలక్ష్మి కూడా వంటగదిలోంచి వచ్చింది.

'మామగారూ!' అని ఆగింది శారద.

'ఆఫీసుకు వెళ్తున్నారా? మంచిదమ్మా!' అన్నాడు జానకిరామయ్య.

'మీతో ఒక మాట చెప్పాలనుకుంటున్నాం నేనూ, మీ అబ్బాయి.'

జానకిరామయ్య, మహాలక్ష్మి సీతారాంవైపు చూశారు.

సీతారాం భార్యవైపు చూసి, చెప్పు అన్నట్లుగా కళ్లతోనే సైగ చేశాడు.

ఇది గమనించి జానకిరామయ్య, భార్య లోలోపల నవ్వుకున్నారు. పెదవులపై చిరునవ్వు నిలిచింది.

'చెప్పమ్మా!' జానకిరామయ్య ధైర్యం ఇచ్చాడు.

'ఏమీ లేదు మామగారూ! ఇందులో విశేషం ఏమీ లేదు. నిన్నటితో రిటైరయ్యారు. సంతోషం. ఇన్నేళ్లు కష్టపడ్డారు. ఇక మీరూ, అత్తగారూ విశ్రాంతి తీసుకోవాలి. మమ్మల్ని బిడ్డలుగా చూస్తున్న మీరు ఇవ్వాల్టినుంచి మాకు కుమారుడు, అత్తగారు కుమార్తె అవుతారు. మీ బాధ్యత, పద్మిని చదువు, పెళ్లి బాధ్యత మాది. ఈ ఇంటిని నడిపే పూచీ మాది. పద్మిని పెళ్లి నిశ్చయం కాగానే మేమిద్దరం మా బ్యాంకుల్లో లోను తీసుకుని మీ అంతస్తుకు తగిన విధంగా వివాహం చేస్తాం. ఇక మీరు శ్రమ పడడం మేం చూడలేం. నేను కాపురానికి వచ్చినప్పటినుంచి ఈ ఐదు నెలలుగా పద్మినిపేర ప్రతినెలా రికరింగులో ఐదు వందలు జమ చేస్తున్నాం. పద్మిని మా బిడ్డ మామగారూ!"

అవునన్నట్టు సీతారాం తల ఊపాడు. భార్య మాటలను బలపరుస్తున్నట్టు అతని కళ్లు మెరుస్తున్నాయి.

జానకిరామయ్య కోడలు మాటలకి ద్రవించిపోయాడు. చలించిపోయాడు. మహాలక్ష్మి ఆనందంతో చెమర్చిన కళ్లు తుడుచుకుంది. జానకిరామయ్యా అంతే.

'అమ్మా! ఇంత చిన్నదానివి, ఎంత విశాలమైన మనస్సమ్మా నీది! చాలు. మా ఇద్దరి జన్మలు ధన్యమయ్యాయమ్మా!. ఆ మాట చాలు. నిజమే. ఇక ఈ ఇంటి బాధ్యత మీ ఇద్దరిదేనమ్మా! సందేహంలేదు. ఇక మాకు ఎలాంటి చింతా వుండదు. మేం ఎన్ని జన్మలలోనో చేసుకున్న పుణ్యంవల్ల ఈ జన్మలో నువ్వు ఈ ఇంటి కోడలిగా వచ్చావు' అన్నాడు.

'నాదే అదృష్టం మామయ్యగారూ!' అంది శారద.

'అదృష్టం అందరిదీఅమ్మాయ్!' అని మహాలక్ష్మిమాట కలిపింది.

'మీకు ఆఫీసుకు టైం కావస్తోందిగదూ? నేనూ మీతో ఒక మాట చెప్పాలనుకున్నానమ్మా! ఉదయంనుంచి నా దైనందిన కృత్యాలలో మార్పు రాలేదేమా అని మీరు ఆశ్చర్యపోయి వుండవచ్చు. పైగా, ఎక్కడికి బయలుదేరుతున్నానా అని కొంచెమైనా ఆలోచన మీ మనసులో మెదిలి వుండవచ్చు. అయితే, నాకు పుత్ర సమానుడికి ఒక మాటిచ్చాను.'

సీతారాం కొంచెం ఉత్సుకతతో 'మన రమేషేనా నాన్నా?' అన్నాడు.

'అవును. అతను నన్ను మరీ మరీ అర్థించాడు. ఏమనో తెలుసా? త్రయోదశి ఘడియల్లో మంగళ వాద్యాలతో ఇంటికొచ్చి అమ్మకీ, అన్నయ్యకీ, వదినమ్మకీ నేను స్వయంగా ఈ సంగతి చెబుతా నాన్నగారూ! మీ దగ్గర చదువుకున్న నన్ను పితృవాత్సల్యంతో చూస్తున్నారు. సరేననండి నాన్నగారూ! 'అని ప్రార్థించాడు. సమ్మతించాను. అతని కోరిక ప్రకారం సాయపడే ఓపిక భగవంతుడు నాకింకా ఇచ్చాడు.'

అసలు సంగతి అర్థం కాక మహాలక్ష్మి, సీతారాం, శారద ఆశ్చర్యపోయి జానకిరామయ్యవంక చూస్తుండిపోయారు.

వాకిట్లో మంగళధ్వని వినిపించింది. కారు ఆగింది. అందులోంచి రమేష్ దిగాడు. ఒక నౌకరు వరండాలో వున్న బోర్డు తీసి, దానిబదులు మరో కొత్త బోర్డు తగిలించాడు దానిమీద 'కె. జానకిరామయ్య ఎం. ఏ, ఎం. ఇడి, ప్రిన్సిపాల్, ఎస్. వి. రాఘవయ్య కాలేజి' అని రాసివుంది.

రమేష్ లోపలికొచ్చి జానకిరామయ్య, మహాలక్ష్మి పాదాలకు నమస్కరించాడు. సీతారాంవేపు తిరిగి నమస్కరించాడు. శారదకు నమస్కరించి 'వదినమ్మా బాగున్నావా?' అని ఆప్యాయంగా పలకరించాడు.

అందరినీ ఉద్దేశించి "కన్నతండ్రిపేర ఏర్పాటుచేసిన కాలేజీకి నన్ను ఇంతవాణ్ణిగా తీర్చిదిద్దిన నాన్నగారు జానకిరామయ్య మాస్టారిని ప్రిన్సిపాల్‌గా వుండి

నన్ను దీవించి, నడిపించమంటే నా మీదున్న వాత్సల్యంతో సరేనన్నారు. ఇప్పుడే ముహూర్తం నిర్ణయించారు. త్రయోదశి పుణ్యకాలం. నా గుండెనిండా నింపుకున్న ఈ ఆనందాన్ని నేనే స్వయంగా చెప్పాలనే పసిబిడ్డ కోరికను నాన్నగారు మన్నించారు. ఇప్పటినుంచి నాన్నగారు ఈ కారు ఉపయోగించుకుంటారు. వారికెలాంటి శ్రమ రానీను. టైం అవుతోంది. అమ్మా, వదినమ్మా, మీరు కారుకు ఎదురు రండి. అమ్మా, అన్నయ్యా, వదినమ్మా! ముందుగా చెప్పనందుకు మన్నించండి. త్రయోదశి పుణ్యకాలంలోనే ఈ మాట బయటికి రావాలని నా చిన్న కోరిక" అన్నాడు.

అందరూ వాకిలివైపు నడిచారు. మళ్లీ మంగళవాద్యాలు రమ్యంగా మోగాయి. కారు కాలేజీ వైపు కదిలింది.

(‘ఆంధ్రభూమి’ సచిత్రమాసపత్రిక - ఫిబ్రవరి, 1996)